# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత అత్యున్నత న్యాయస్థానం 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.
- ❖ దేశ వారసత్వాన్ని భావి తరాలకు అందించాలని ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు.
- ❖ ఐక్య రాజ్య సమితి వార్షిక వాతావరణ మార్పుల సమావేశం (COP 29) ఈరోజు అజర్ బైజాన్ లోని బాకు నగరంలో ప్రారంభమైంది.
- ❖ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (IFFI) 55వ ఎడిషన్ గోవాలో ఈ నెల 20న ప్రారంభం కానుంది.
- ❖ మహిళల ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ 2024 ఈరోజు బీహార్‌లోని రాజ్‌గిర్‌లో ప్రారంభమైంది.

==========================

భారత అత్యున్నత న్యాయస్థానం 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జస్టిస్ ఖన్నాతో ప్రమాణం చేయించారు. నిన్న పదవీ విరమణ చేసిన జస్టిస్ డి.వై. చంద్రచూడ్ స్థానంలో సంజీవ్ ఖన్నా బాధ్యతలు చేపట్టారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వచ్చే సంవత్సరం మే 13 వరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈ పదవిలో కొనసాగనున్నారు.

==========================

భారతీయ యువత సామర్థ్యానికి యావత్ ప్రపంచం ఆకర్షితమవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్‌లోని వడ్తాల్‌లోని శ్రీ స్వామినారాయణ్ మందిర్ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈరోజు దృశ్యమాధ్యమం ద్వారా నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ... 200 సంవత్సరాల క్రితం స్వామినారాయణ స్థాపించిన వడ్తాల్ ధామ్ ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజలు సజీవంగా నిలిపారన్నారు. "వికాస్ భీ విరాసత్ భీ" అనే ప్రభుత్వ విధానాన్ని పునరుద్ఘాటిస్తూ.. ఏ దేశమైనా తన వారసత్వాన్ని పరిరక్షించ కుండా పురోగమించదని అన్నారు. భారతదేశం గొప్ప వారసత్వం గురించి గర్వపడాలని, దానిని భావి తరాలకు అందించాలని దేశ ప్రజలకు, ఆధ్యాత్మిక నాయకులకు నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు.

(వాయిస్ 42 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్య రాజ్య సమితి వార్షిక వాతావరణ మార్పుల సమావేశం (COP 29) ఈరోజు అజర్ బైజాన్ లోని బాకు నగరంలో ప్రారంభమైంది. "ఫైనాన్స్ COP" గా పిలువబడే ఈ కార్యక్రమం రెండు వారాల పాటు జరగనుంది. వాతావరణ ప్రభావాలకు అత్యంత హాని కలిగించే దేశాల కోసం నూతన వాతావరణ ఆర్థిక లక్ష్యాన్ని రూపొందించడంపై ఈ కార్యక్రమంలో దృష్టి సారిస్తారు. కాగా ప్రపంచ దక్షిణాది దేశాల వాతావరణ లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేస్తున్న సంస్థలను ఇది రక్షిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈరోజు రాజ్ గిర్ లో మహిళల ఆసియా హాకీ ఛాంపియన్స్ ట్రోఫీ 2024 ను లాంఛనంగా ప్రారంభించారు. రాజ్ గిర్ లోని ఆస్ట్రో టర్ఫ్ హాకీ స్టేడియంలో ప్రారంభమయిన ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొంటున్న 6 జట్ల సభ్యులకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాగా బీహార్ లో తొలిసారి అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (IFFI) 55వ ఎడిషన్ గోవాలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ పాల్గొన్నారు. IFFIకి ప్రపంచ వ్యాప్తంగా చిత్ర నిర్మాతలు, ప్రేక్షకుల నుండి విశేష స్పందన వస్తోందని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

గోవాలో జరగనున్న ఈ ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రముఖ ఆస్ట్రేలియన్ ఫిల్మ్ మేకర్ ఫిలిప్ నోయిస్‌కు సత్యజిత్ రే లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాన్ని అందజేయనున్నామని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. వర్ధమాన దర్శకులను గుర్తించేందుకు రైజింగ్ స్టార్స్, పర్యావరణ స్పృహ కలిగిన సినిమాలను ప్రోత్సహించేందుకు మిషన్ లైఫ్ లాంటి నూతన విభాగాలను ఈ సంవత్సరం పరిచయం చేస్తున్నామని వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జార్ఖండ్‌లో తొలి దశ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఈరోజుతో ముగిసింది. ఈ దశలో 43 నియోజకవర్గాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది. ఎన్డీయే, ఇండియా కూటమి నాయకులు తమ పార్టీ అభ్యర్థుల తరపున ఈరోజు ముగింపు

ప్రచారంలో పాల్గొన్నారు. 'మేరా బూత్ సబ్సే మజ్ బూత్' ప్రచారంలో భాగంగా ఈరోజు జార్ఖండ్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలతో ఆ పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగించారు. ఇదిలా ఉండగా జార్ఖండ్‌లోని 5 జిల్లాల్లోని 225 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ పార్టీలను పంపామని ప్రధాన ఎన్నికల అధికారి కె. రవికుమార్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ - రష్యా మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయవలసిన అవసరం ఉందని విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పేర్కొన్నారు. ఈరోజు ముంబైలో జరిగిన ఇండియా - రష్యా బిజినెస్ ఫోరమ్‌లో ఆయనతో పాటూ రష్యా ఉప ప్రధానమంత్రి డెనిస్ మంటురోవ్ పాల్గొన్నారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య వాణిజ్యం 66 బిలియన్ డాలర్లుగా ఉందని, 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల మార్కును దాటుతుందని జైశంకర్ విశ్వాసం వ్యక్తం చేస్తూ....

(వాయిస్ 44 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో శతాబ్దాల నాటి నాగరికత ప్రపంచాన్ని సానుకూలంగా ప్రభావితం చేసిందని, విశ్వగురువుగా, ఎందరికో మార్గదర్శకంగా పనిచేస్తోందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రీయ విద్యాలయ సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లో 3 రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి "రాష్ట్రీయ ఏక్తా పర్వ్"ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... "రాష్ట్రీయ ఏక్తా పర్వ్"లో భాగంగా దేశం యొక్క గొప్ప సాంస్కృతిక, భాషా వైవిధ్యాన్ని జరుపుకుంటున్నామన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత, విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని మంత్రి జి.కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు సాధారణంగా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 79 వేల 298 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 79 వేల 496 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 24 వేల 141 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.39గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 73 డాలర్ల వద్ద ట్రేడుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 678 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దుబాయ్ లో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్ టీ) నూతన క్యాంపస్ ను త్వరలో ప్రారంభించనున్నామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. న్యూఢిల్లీలో జరిగిన ఐఐఎఫ్ టీ-57వ స్నాతకోత్సవంలో వర్చువల్ గా ప్రసంగించిన పీయూష్ గోయల్ భారతదేశ ఉజ్వల భవిష్యత్తును సాధించడంలో నూతన గ్రాడ్యుయేట్లు పోషించగల కీలక పాత్రను ప్రస్తావించారు. ఈ రోజు యువ భారత్ ప్రపంచం ముందు నిలబడే ఆత్మవిశ్వాసంతో ఉందని, 140 కోట్ల మంది ఆకాంక్ష గల భారతీయుల భవితవ్యాన్ని రూపొందించే అవకాశం వారికి ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =